క్లుప్తంగా

క్లాప్ వాహన డ్రైవర్‌లకు బకాయి జీతాలు చెల్లించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న క్లాప్ వాహన డ్రైవర్‌లు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: క్లాప్ వాహన డ్రైవర్‌ల బకాయి జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద క్లాప్ వాహనాల డ్రైవర్స్‌తో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండవ రోజు క్లాప్ ఆటోలన్నీ విధులకు వెళ్లకుండా నిలిపివేశారని తెలిపారు. మూడు నెలల వేతన బకాయిలు, 8 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించేంతవరకు విధులకు హాజరుకామని స్పష్టం చేశారు. ఈ నిరసనకు మున్సిపల్ వర్కర్స్ మద్దతిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ సింహాచలం, బంగారు రవి పాల్గొన్నారు.

కళాశాలలు మూయించిన ఎస్ఎఫ్ఐ



కళాశాలలు మూసివేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తెరిచిన ప్రైవేట్ కళాలలను ఎస్ఎఫ్ఐ సభ్యులు బుధవారం మూసివేయించారు. ప్రభుత్వం ప్రకటించిన మొహర్రం సెలవు దినానికి వ్యతిరేకంగా కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు మూసివేయించినట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులపై చదువుల భారం వేయకుండా చర్యలు చేపట్టామని తెలిపారు.

కూలిన స్కూల్ ప్రహరీ

భామిని: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ మంగళవారం రాత్రి కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రహరీ బాగా తడిసిపోయి పడిపోయింది. అధికారులు స్పందించి కొత్త ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మొరాయించిన 108 వాహనం



ఆగిపోయిన 108 వాహనం

సీతంపేట: రోగిని తీసుకెళ్లడానికి వచ్చిన 108 వాహనం మొరాయించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సీతంపేటకు చెందిన ధర్మారావు అనే డయాలసిస్ పేషెంట్‌ను శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లడానికి కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం 108కు ఫోన్ చేశారు. దీంతో శ్రీకాకుళం జిల్లా బూర్జలో ఉన్న 108 వాహనం వచ్చింది. సరిగ్గా పేషెంట్ ఇంటికి సమీపంలోకి వచ్చేసరికి వాహనం ఆగిపోయింది. వీల్ బేరింగ్ పాడవ్వడంతో వాహనం నిలిచిపోయిందని సిబ్బంది చెప్పారు. రోగిని మరో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.


అనారోగ్యంతో హెచ్‌సీ మృతి



కద్రక బుదురు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కద్రక బుదురు బుధవారం మృతి చెందారు. కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న హెచ్‌సీ ఆయన స్వగ్రామమైన వంగరలో మరణించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై శివప్రసాద్, తదితరులు సంతాపం తెలియజేశారు.

అవగాహనతో ప్రమాదాలను అధిగమిద్దాం



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారి

పాలకొండ రూరల్: అవగాహనతో అగ్ని ప్రమాదాలను అధిగమిద్దామని అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని మణిరత్నం పెట్రోల్ బంక్‌లో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బంక్‌లో అనుకోని ప్రమాదాలు సంభవిస్తే వాటిని అదుపుచేసే మెలకువలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకుంటే తక్షణమే 101 లేదా 08941-260111 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

'మరుగు'న పడిన మరమ్మతులు..!

- సామాజిక టాయిలెట్ల వినియోగం ఎప్పుడో?
- మంత్రి ఆదేశించినా ప్రారంభం కాని పనులు
- నిధుల కోసం నిరీక్షిస్తున్న అధికారులు
- సెలవులో మున్సిపల్ కమిషనర్



ఏరియా ఆస్పత్రి సమీపంలో మరమ్మతుల బారిన పడిన సామాజిక మరుగుదొడ్లు

సాలూరు:

పట్టణంలోని సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు ఎప్పుడవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. సాలూరు మున్సిపాలిటీలో సుమారు 35 సామాజిక మరుగుదొడ్లు ఉన్నాయి. వాటిలో 10 పూర్తిగా పాడైపోగా, 25 పాక్షికంగా మరమ్మతులకు గురైనప్పటికీ వినియోగంలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పట్టణంలోని సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈ అంశానికి ప్రాధాన్యం ఇచ్చి పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. మంత్రి ఆదేశించి వారాలు గడిచిపోతున్నా ఆ దిశగా అధికారులు అడుగులు వేయకపోవడంతో మంత్రి ఆదేశించినా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించగా నిధులు లేకపోవడంతో పనులు చేపట్టలేకపోతున్నామని మున్సిపల్ అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ పనులకు సుమారు రూ.20 లక్షలు అవసరమని తెలిపారు. దీనిపై నాడు కలెక్టర్‌గా ఉన్న నిషాంత్‌కుమార్‌తో మాట్లాడానని, కలెక్టర్ నిధులు మంజూరుచేస్తానన్నారని, మీరు ప్రతిపాదనలు పంపించాలని మున్సిపల్ అధికారులకు మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మంత్రి సూచించారు.

ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు, తీర్మానాన్ని కలెక్టర్‌కు పంపించి, కాపీని మంత్రికి అందజేశారు. అయితే ఇటీవల కలెక్టర్ నిషాంత్ కుమార్‌కు బదిలీకావడం, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వాణి సెలవుపై వెళ్లిన నేపథ్యంలో పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోననే సందేహం పట్టణ ప్రజల్లో మళ్లీ మొదలైంది. మంత్రి సంధ్యా రాణి స్పందించి నిధులు మంజూరుచేయించి పనులు జరిగేలా చూస్తారని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

నిధుల కొరత కారణంగా మున్సిపాలిటీలోని సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు చేయించలేదు. ఈ పనులకు సుమారు రూ.20 లక్షలు అవసరం. మున్సిపల్ తీర్మానం చేసి నిధుల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాం. కాపీని మంత్రికి అందజేశాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

– శ్రీరామ్మూర్తి, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్, సాలూరు

విజయవంతంగా పంట కోత ప్రయోగం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న సెంటిస్ట్, అధికారులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో బుధవారం పంట కోత ప్రయోగం విజయవంతంగా నిర్వహించినట్లు ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు పరిధిలో ఫార్మర్ సైంటిస్ట్‌గా శిక్షణ పొందుతున్న జి.ఉషారాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె గ్రామంలో డీపీఎం షణ్ముఖ రాజు ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొలంలో ఖరీఫ్ ప్రధాన పంటకు ముందు 26 రకాల విత్తనాలు పొలంలో పచ్చిరొట్ట ఎరువులు వేసినట్లు చెప్పారు. పచ్చిరొట్ట 5''5 మీటర్లలో 18కేజీల దిగుబడి వచ్చిందని, ఈ విధంగా పలు రకాల పంటలు వేయడం వల్ల నేలకు సారం, పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ వై.తిరుపతి, ఎం.టి శ్రీరాములు, ఎస్ఎస్.తవుడు ఫార్మర్ సైంటిస్టులు పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా మారిన పారిశుధ్య వారోత్సవాలు



వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు లేకుండా ప్రారంబమైన పారిశుధ్య వారోత్సవాలు

- వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు అందని పిలుపు
- 20 శాతం టీడీపీ ప్రజాప్రతినిధులతోనే కార్యక్రమం

సాలూరు రూరల్: పార్టీలతో సంబంధం లేకుండా నిర్వహించాల్సిన ప్రభుత్వ కార్యక్రమాలు సాలూరు మండలంలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతున్నాయి. నోడల్ ఆఫీసర్ శాంతేశ్వర రావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించిన పారిశుధ్య వారోత్సవాల అవగాహన సదస్సుతో పాటు ర్యాలీకి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను పిలకుండానే నిర్వహించారని మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆరోపించారు. పారిశుధ్య వారోత్సవాలంటే ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమం. మండలంలో 80 శాతం ప్రజాప్రతినిధులు వైఎస్ఆర్‌సీపీకి సంబంధించిన వారేనని ఎంపీపీ, వైస్ ఎంపీపీ లేకుండానే ఈ కార్యక్రమం ప్రారంభించిన అధికారులు అధికార పార్టీ చెప్పినట్లు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను దూరం పెట్టడం సరికాదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను దూరం పెట్టే ఆలోచన మానుకుని ప్రజలకోసం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని సర్పంచ్‌లు సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కొమరాడ: మండలంలోని బంగారమ్మపేట సమీపంలో బుధవారం వాహన తనిఖీలు చేపడుతుండగా రాయగడ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న టాటా మ్యాజిక్‌లో నాలుగు మద్యం బాటిళ్లు లభ్యమైనట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. అలాగే పార్వతీపురం నుంచి సోమినాయుడువలస వైపు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తున్న వ్యక్తి నుంచి ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయనపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొండచీపుర్ల తయారీతో ఉపాధి

సీతంపేట: కొండచీపుర్ల తయారీతో గిరిజనులకు ఉపాధి లభిస్తుందని తహసీల్దార్ మహేశ్వరరావు అన్నారు. ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొండచీపుర్ల తయారీ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ తరహా శిక్షణలు ఇచ్చి ఎఫ్‌పీఓ సంఘాలను బలోపేతం చేయడం ఎంతో మంచిదన్నారు. ఎఫ్‌పీఓ సీఈఓ ఆరిక గౌతమి మాట్లాడుతూ.. వారం రోజులుగా 15 మంది రైతులకు తాము శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విలువ ఆధారిత వస్తువులు తయారు చేసి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సన్మానగ్రహీతకు జ్ఞాపిక అందిస్తున్న రాష్ట్ర యూనియన్ సభ్యులు

పాలకొండ రూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తానని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ గోపాలరావు అన్నారు. బుధవారం పాలకొండ వచ్చిన ఆయన్ను ఆ శాఖ స్థానిక అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం ట్రాన్స్‌కో ఎస్సీ ఆపరేషన్ అధికారి ఎస్.కృష్ణమూర్తి, సీనియర్ అకౌంట్స్ అధికారి పి.తాతాచారి, ఈఈ టీజీకే మూర్తి, రాష్ట్ర కమ్యునికేషన్ సెక్రటరీ ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా యంత్రాలతో దమ్ములు



యంత్రాలతో దమ్ములు చేస్తున్న రైతులు



నొల్లతో చదును చేసిన పొలంలో ఉబాలు చేస్తున్న మహిళా రైతులు

సీతానగరం: మూడురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని రైతులు యంత్రాలతో దమ్ము పనులు, వరినారు తీయడం, నొల్లతో భూమిని చదును చేస్తూ ఉబాలు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి మండలంలోని వెంకటాపురం, బూర్జ, చెల్లన్నా యుడువలస, లక్ష్మీపురం, నిడగల్లు, బుడ్డిపేట, కృష్ణారాయపురం గ్రామాలకు కరిసిన వర్షం వరి ఉబాలు చేయడానికి కలిసిరావడంతో రైతులు ట్రాక్టర్ల సహాయంతో పంటదమ్ములు చేశారు.

ఎరువుల కొరత నివారణకు చర్యలు



మండలంలోని నాలుగు ఎరువుల విక్రయ (బూర్జ-2, మరిపివలస-1, సీతానగరం-1) కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఎస్.అవినాష్, మండల ఏఓ సీతానగరం.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

కురుపాం : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి ఒక్కసారిగా పెరిగింది. ప్రతిరోజూ పదుల సంఖ్యలో జ్వర పీడితులు ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. అయితే ఆస్పత్రిలో అరకొర సౌకర్యాలుండడంతో ఒకే బెడ్‌పై ఇద్దరేసి రోగులను ఉంచి చికిత్స అందిస్తున్నారు. వైద్యారోగ్య శాఖాధికారులు స్పందించి సౌకర్యాలు మెరుగుపరచాలని గిరిజన రోగులు కోరుతున్నారు.

తక్కువ ధరకే నిత్యావసర సరుకులు

కురుపాం : రిటైల్ షాపుల వద్ద సరసమైన ధరలకు నాణ్యమైన కందిపప్పు, బియ్యం లభ్యమవుతున్నాయని, వీటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బీఎస్ఎస్ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ వద్ద పౌరసరఫరా శాఖ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రిటైల్ షాపును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, నాయకులు కర్రి శ్రీను, సురేష్, ఆర్ఐ కరుణాకర్, వీఆర్ఓ మహేంద్ర పాల్గొన్నారు.

ధరల నియంత్రణకే ప్రత్యేక కౌంటర్లు..

గరుగుబిల్లి: నిత్యావసర సరుకుల అధిక ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని స్థానిక సర్పంచ్ కె. ఇందుమతి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు, బియ్యంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశవాళి కందిపప్పు కిలో రూ. 160, సోనామసూరి ఫైన్ రకం రూ.49, మసూరి ముడిబియ్యం 48 రూపాయలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం. కృష్ణ, నాయకులు వై. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



పెదభోగిలి కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులు



కొత్తవలసలో యంత్రాలతో కాలువలో పూడిక తీస్తున్న పనిని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ వర్మ

సీతానగరం: మండలంలో ప్రారంభమైన పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తవలస, గెడ్డలుప్పి, సూరంపేట, కాశీపేట, పెదబోగిలి గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఈఓపీఆర్డీ కె. కుమార వర్మ పరిశీలించారు. ఈ మేరకు కొత్తవలసలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఉత్వర్వుల మేరకు 35 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, వేతనదారులతో పారిశుధ్య పనులు, కొత్తవలసలో కాలువల్లో పేరుకుపోయిన పూడికలను యంత్రాలతో తీయించే పనులను నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే మండల ప్రత్యేకాధికారి కె. రామచంద్రరావు మంగళవారం వివిధ గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారని తెలియజేశారు.

వర్షాలతో తస్మాత్ జాగ్రత్త ..

- మూగజీవాలకు పొంచి ఉన్న ముప్పు
- ముందస్తు జాగ్రత్తలతో పాడి సంరక్షణ
- వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచిస్తున్న వైద్యులు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది (ఫైల్)

సీతంపేట: వర్షాకాలం వచ్చేసింది.. ఈ కాలంలో పశువులు, గొర్రెలు, మేకలకు పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఈదురుగాలులు, వర్షపు జల్లులకు జోరీగలు, దోమల సంఖ్య పెరగడం వల్ల పశువులకు గొంతువాపు, జబ్బువాపు, గాలికుంటు, తదితర వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పెంపకందారులు అప్రమత్తంగా ఉండి పశువులు, మూగజీవాలను వ్యాధుల బారి నుంచి కాపాడుకోవాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా పాడి సంపదను కోల్పోకతప్పదని పశుసంవర్ధక వైద్యులు చెబుతున్నారు. సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తించి జాగ్రత్తలు పాటించడం ద్వారా పాడి సంపదను కాపాడుకోవచ్చు.

జిల్లాలో పశుసంపద వివరాలు..

ఆవులు	2,28,98
గేదెలు	47,203
గొర్రెలు	1,73,814
మేకలు	2,08,609

● **గొంతువాపు వ్యాధి..**

వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు ప్రధానమైనది. దీన్ని గురక వ్యాధి అని కూడా అంటారు. శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. గొంతు, మెడ వాచిపోవడంతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి.

● **నివారణ**

ప్రతి ఏడాదీ తొలకరిలోనే ముందు జాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలి. వ్యాధి ఆశించిన తర్వాత సల్ఫాడిపోజిన్ ఇంజక్షన్ వేయాలి.

● **చిటుక వ్యాధి ..**

దీన్ని ఎంటిరోటాక్సీమియా అని కూడా అంటారు. ఇది క్లాస్ట్రీడియం అనే సూక్ష్మ క్రిమి వల్ల కలుగుతుంది. తొలకరి చినుకులు పడిన తర్వాత వచ్చిన పచ్చికను గొర్రెలు, మేకలు మేసినప్పుడు గడ్డితో పాటు ఈ వ్యాధిని కలుగజేసే సూక్ష్మక్రిములు వాటి కడుపులోనికి ప్రవేశించి కొన్ని విషపదార్థాలను విసర్జించడం వల్ల ఈ వ్యాధి ఆశిస్తుంది. వ్యాధి సోకిన గొర్రెలు చెంగున ఎగిరి హఠాత్తుగా మరణిస్తాయి. వ్యాధి తీవ్రత తక్కువగా ఉన్నపుడు గొర్రెలు పలుచగా పారుకోవడం, కాళ్లు బిగిసి నడవడం, ఒక్కసారిగా పడిపోవడం, తల వెనుకకు లాగుతూ కనిపిస్తాయి. ఆ తర్వాత ఊపిరాడక మరణిస్తాయి.

● **నివారణ**

నాలుగు నెలల పైబడిన గొర్రె పిల్లలకు ప్రతి సంవత్సరం సీజన్‌లో చిటుక రోగం నిరోధక టీకాలు వేయించాలి. ఈ టీకాలు వేసే సమయానికి నెల రోజులు ముందుగా విధిగా గొర్రెలన్నింటికీ నట్టలు, బద్దె పురుగు నివారణ మందులు తాగించాలి. టీకాలు వేసిన గొర్రెలకు ఒక సంవత్సరం వరకు ఈ వ్యాధి రాదు. ఈ టీకా ప్రతి పశువైద్యశాలలో ఉచితంగా లభిస్తుంది.

● **పీపీఆర్ వ్యాధి..**

వైరస్ వల్ల గొర్రెలు, మేకల్లో ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన పశువులు 90 శాతం వరకు మృత్యువాత పడతాయి. 106 డిగ్రీల జ్వరం వస్తుంది. ముక్కు నుంచి నీరు కారడం, నోటిలో పుండ్లు ఏర్పడడం గమనించవచ్చు. దుర్గంధంతో కూడిన విరేచనాలవుతాయి. పశువులైతే ఆహారం తీసుకోక మృతి చెందుతాయి.

నివారణ

పీపీఆర్ టీకా మందును ముందస్తుగా వేయించాలి.

● **వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

వర్షాకాలంలో పశువులు, మేకలు, గొర్రెలను పాకల్లోనే ఉంచాలి

- బురద, చిత్తడి నేలల్లో తిరగకుండా చూడాలి
- పరిశుభ్రమైన నీరు తాగించాలి. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి.
- లేగదూడలను వ్యాధి ప్రబలిన పశువులకు దూరంగా ఉంచాలి.
- మేత, దాణా తగు మోతాదులో ఇవ్వాలి.
- ఎటువంటి వ్యాధి లక్షణాలున్నా వెంటనే సంబంధిత పశువైద్యాధికారిని సంప్రదించి నివారణకు తగు చర్యలు తీసుకోవాలి.
- ముందు జాగ్రత్తగా పశువులకు యాంటీ బయాటిక్స్ టీకాలు వేయించాలి.

టీకాలు వేస్తున్నాం



ముద్ద చర్మవ్యాధులతో పాటు మిగతా వ్యాధులకు టీకాలు వేస్తున్నాం. ముఖ్యంగా పశువులను వర్షంలో తడవనీయకూడదు. వీలైనంతవరకు పశువులను పాకల్లోనే ఉంచాలి. మేతకు తీసుకెళ్లేటప్పుడు తుప్పలు, డొంకల వద్ద విషసర్పాలుండే ప్రమాదముంది. కాబట్టి పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. పశువుల ఆస్పత్రుల వద్ద, గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం.

– శ్రీనివాసరావు, పశుసంవర్థక శాఖ ఏ.డి., సీతంపేట

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పాలకొండ రూరల్: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఈ నెల 19వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో తంపటాపల్లి, గొట్ట మంగళాపురం, చిన మంగళాపురం, యరకారాయపురం, బుక్కూరు, రాజుపేట, అర్ధలి, బాసూరు, ఎల్ఎల్ పురం, పద్మాపురం, చిన కోటిపల్లి, తదితర గ్రామాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.